సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 11 । జనవరి । 2024



ఉత్తమ వైద్యులుగా పేరు తెచ్చుకోవాలి

ఉత్తమ వైద్యులుగా పేరు తెచ్చుకోవాలని కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాల పూర్వపు డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ పేర్కొన్నారు. -8లో



ఆదాయానికి ప్రైవేటు

బి.కొత్తకోట మండలంలోని వేసవి విడిది కేంద్రం హార్సిలీహిల్స్ టూరిజం ఆదాయం తిరోగమనంలో పయనిస్తోంది. ప్రైవేట్ అతిథిగృహాల దెబ్బకు విలవిలాడుతోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 123 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	468	486
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1183.180 కిలోలు

న్యూస్‌రీల్

అంగళ్లు విద్యార్థులకు సదవకాశం



జపాన్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన మిట్స్ విద్యార్థులు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల సైబర్ సెక్యూరిటీ విభాగం ఆఖరి సంవత్సరం చదువుతున్న తహసీన్, మోక్షిత్‌రెడ్డి, చైతన్య జపాన్‌లోని ఐవాటి ప్రిఫెక్చురల్ యూనివర్సిటీ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. వీరు మూడు నెలలపాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై పరిశోధనలు చేస్తారని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, టీడీఏ (యానాదులు) గురుకుల బాలుర పాఠశాలలో ఖాళీగా ఉన్న పీఈటీ (వ్యాయామ) ఉపాధ్యాయ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఉమ్మడి కడప జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు ఉమ్మడి కడప జిల్లా కడప బాలుర, బాలికల, పులివెందుల, మైదుకూరు, పోరుమామిళ్ల, రాయచోటి బాలిక, బాలుర వసతి గృహాలలో దరఖాస్తులు లభిస్తాయని తెలిపారు. డిగ్రీ కలిగి, 45 సంవత్సరాల వయస్సు లోపు వారై ఉండాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 25వ తేది సాయంత్రం లోగా కన్వీనర్/ప్రిన్సిపల్‌కు అందజేయాలని కోరారు. వివరాల కోసం 9948788955, 9440687844, 7382264994, 94411 46908 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

'స్వదేశీ దర్శన్'లో గండికోటను చేర్చాలి



వినతిపత్రం సమర్పిస్తున్న జాస్తి వీరాంజనేయులు

కడప కల్చరల్: వారసత్వ సాంస్కృతిక, చారిత్రక అంశాల పరిరక్షణ కోసం ఉద్దేశించిన 'స్వదేశీ దర్శన్ పథకంలో వైఎస్సార్ జిల్లాలోని గండికోటను చేర్చాలని అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర పురావస్తుశాఖ నూతన డైరెక్టర్ జనరల్ యదుబీర్‌సింగ్ రావత్‌కి వినతిపత్రం ఇచ్చారు. గండికోటకు యునెస్కో గుర్తింపు కోసం తాత్కాలిక జాబితాలో చేర్చే దశకు తెచ్చామని, అయితే పురావస్తుశాఖ నుంచి సరైన సమయంలో డోసీయర్ (ఆ క్షేత్ర సమగ్ర వివరాలు) పంపకపోవడంతో గుర్తింపు ఆలస్యమవుతోందని డీజీకి తెలిపారు.

స్ట్రాంగ్ రూంలో అవసరం లేని వస్తువులు తొలగించాలి



మాట్లాడుతున్న జేసీ

రాయచోటి : జిల్లాలోని ఖజానా కార్యాలయాల స్ట్రాంగ్ రూముల్లో వివిధ ప్రభుత్వ శాఖలు భద్రపరిచిన అవసరం లేని వస్తువులను తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సామగ్రి నిల్వ చేసుకునేందుకు స్థలాభావం ఏర్పడుతుందని, ఈ కారణంగా వివిధ శాఖలకు సంబంధించిన వస్తువులను తొలగించేందుకు రాష్ట్ర ఖజానా శాఖ జిల్లాస్థాయిలో ఒక పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి మహబూబ్, ఏటీఓ ఖాదర్ వల్లి, ఎస్‌టీఓ గోపాల్, రమేష్, హరీష్ యాదవ్, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

13 నుంచి సురభి నాటకాలు

పులివెందుల: సంక్రాంతి సంబరాల సందర్భంగా పులివెందులలోని గరండాల్ రివర్ ఫ్రంట్ (రాణితోపు)లో ప్రఖ్యాత సురభి కళాకారులతో ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు నాటక ప్రదర్శనలు జరగనున్నాయి. ఈ విషయాన్ని పాడా ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గరండాల్ రివర్ ఫ్రంట్‌కు ప్రవేశ రుసుం రూ.20 టికెట్ తీసుకోవాలని, నాటక ప్రదర్శనలను ఉచితంగా తిలకించవచ్చన్నారు. 13వ తేదీన మాయాబజార్, 14న భక్త ప్రహ్లాద, 15న పాతాళభైరవి, 16న శ్రీకృష్ణ తులాభారం, 17న బాలనాగమ్మ, 18 పద్మావతి శ్రీనివాస కళ్యాణం నాటకాలు ఉంటాయన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6:30 నుంచి 8:30 వరకు ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

కోడిపందేలకు.. సై

- పందేలకు సిద్ధమైన పల్లెలు
- సంకాంత్రి నేపథ్యంలో పందెంకోళ్ల కొక్కరోకో...
- కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో కోడిపందేలు
- పోలీసుల నిఘా తీవ్రతరం





రాజంపేట: పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. పండుగ సందడితో పాటు కోడి పందేల కోలాహలం కూడా జోరుగా సాగుతోంది. ఇప్పటికే ఎక్కడెక్కడో దూరాభారాన ఉన్న ఉద్యోగాలు ఒక్కొక్కరుగా ఊర్లల్లోకి వాలిపోతున్నారు. మరోవైపు గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో కోడిపందేలు జరగనున్నాయి. కోడిపందేల కోసం పుంజులను ప్రత్యేకంగా పెంచుతారన్నది తెలిసిందే. పందెం కోళ్లకు ఏడాది పొడవునా శిక్షణ ఇస్తారు. ఈ సారి వాటి విలువ అత్యధికంగా రూ.50వేలు వరకు పలకడం విశేషం. సంకాంత్రి సమయంలో మూడురోజుల పాటు గుట్టుచప్పుడుగా నిర్వహించుకోవడం కొనసాగుతూ వస్తోంది.

పుంజులు బరిలోకి..

సంక్రాంతి పర్వదినాన కోడి పందేలు హోరెత్తుతాయి. పుంజును బరిలోకి దించడానికి కూడా పలువురు పందేల రాయుళ్లు శాసాన్ని నమ్ముతారు. దాని ప్రకారమే నడుచుకుంటారు. ఈ శాస్త్రం పేరే కుక్కుటశాస్త్రం. ఇది కోడిపుంజుల పోరుకు దిశా నిర్దేశం చేసే పంచాగం వంటిది. ఏళ్ల తరబడి కోడి పందేలు నిర్వహించే పలువురికి ఇదే ప్రామాణికం. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల పరిధిలో కోడి పందేలకు అధికంగా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహకులు చాపకింద నీరులా రెడీ చేసుకుంటున్నారు.

మూడురోజుల పాటు..

మూడురోజుల పాటు జరిగే సంక్రాంతి సంబరాలలో పల్లెలు ఇరువైపులా ఉండే రహస్య ప్రాంతాల్లో కోడిపందేలు జరుగుతాయి. పలుచోట్ల గ్రామీణ ప్రాంతాల్లోని శివారు ప్రాంతాలు, తోటల్లో బహిరంగంగానూ కోడిపందేలు జరిగే పరిస్థితులు ఉన్నాయి. ఉభయవైఎస్సార్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో పందేంకోళ్లకు కత్తులు చుట్టేందుకు స్థలాల కోసం సన్నహాలు చేస్తున్నట్లుగా ప్రచారం ఊపందుకుంది. జిల్లాలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో, ఇటు నెల్లూరు జిల్లా, చిత్తూరు జిల్లా సరిహద్దు గ్రామీణ ప్రాంతాల్లో కోడిపందేలకు సర్వంసిద్ధం చేసుకుకుంటున్నారు.

పందెం కోళ్ల రకాలు

ఈకల రంగును బట్టి పందెం కోళ్ల రకాలుగా విభజింపబడ్డాయి.

పేరు	పుంజు రంగు
కాకి	నల్లని ఈకలు
సేతు	తెల్లని ఈకలు
పర్ల	మెడపై నలుపు, తెలుపు ఈకలు
సవల	మెడపై నల్లని ఈకలు
కొక్కిరాయి	నల్లటి శరీరం, 2, 3రంగుల ఈకలు
డేగ	ఎర్రటి ఈకలు
నెమలి	రెక్కలపై పసుపు, రంగు ఈకలు
కౌజు	నలుపు, ఎరుపు ,పసుపు
మైల	ఎరుపు, బూడిద రంగు
పూల	ఒక్కో ఈకపై నలుపు, తెలుపు
పింగళి	లేత గోదుమరంగు ఈకలు
ముంగిస	ముంగిస జూలు
అబ్రాసు	లేత బంగారు ఈకలు
గేరువా	తెలుపు,లేత ఎరుపు

కోడిపందేలపై నిఘా తీవ్రతరం



కోడిపందేలపై నిఘాను తీవ్రతరం చేస్తున్నాం. ఇప్పటికే గతంలో కోడి పందేలాకు సంబంధించిన పాతకేసులలో ఉన్న వారికి స్టేషన్ల వారీగా ముందుగానే కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించాం. సంకాంత్రి సందర్భంగా పల్లెలలో కోడిపందేలా జరిగేందుకు అవకాశాలు ఉన్న చోటపై దృష్టి సారించాం.

-బి. కృష్ణారావు, ఎస్పీ, రాయచోటి

కోడిపందేలకు వేల ఏళ్ల చరిత్ర



పల్నాడు యుద్ధంలో కోడిపందాలను చూపే శిల్పం

సంప్రదాయమో వ్యసనమో కానీ కోడిపందేలనూ సంక్రాంతి పండగనూ వీడదీసి చూడలేం. మనపల్లె సంస్కృతితో ఇంతగా పెనవేసుకుపోయిన ఈ సంప్రదాయానికి వందలు కాదు ..వేలఏళ్లచరిత్ర ఉంది. 15వ శతాబ్దపు సామాజికపరిస్థితులకు అద్దంపటే కావ్యమైన 'హంసవింశతి'తో కోడిపందేల గురించి అయ్యలరాజు నారాయణకవి స్పష్టంగా వివరించారు.

కోడి కాలికి కత్తి కడితే..



కోడికి కత్తి కుడుతున్న పందేంరాయుడు (ఫైల్)

ఒక కోడిపుంజుకు కత్తి చుడితే రూ.2వేలు వసూలు చేయనున్నారు. కత్తులు ఇస్తే రూ.4వేలు అర్పించవచ్చునని, కత్తులు దూరప్రాంతాల నుంచి పందెంరాయుళ్ల తెప్పించుకుంటున్నారు. గాజు, డేగ జాతి కోళ్లకు జోరుగా పందేలు కాస్తారు. పోలీసు కళ్లు గప్పి రహస్య స్థావరాలలో పందేలు నిర్వహించుకునేందుకు సన్నహాలు చేసుకుంటున్నారు.

పోలీసుల డేగ కన్ను..



కోడింపందేల పై మూడేళ్లుగా కోర్టు నిషేధం విధిస్తున్నా పలుచుచోట్ల యథావిధిగా నిర్వహిస్తున్నారు. కోడిపందేలా స్థావరాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. కోడిపందేలు నిర్వహిస్తారన్న అనుమానం ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో పందెం రాయుళ్ల మూములుగా నిర్వహించే చోట కాకుండా గ్రామాలకు దూరంగా ప్రత్యేకస్థలం కోసం అన్వేషణలు చేసుకుంటున్నట్లు సమాచారం. కోడిపందేల సమయంలో పైపందెం కూడా జరుగుతయని తెలుస్తోంది. పాతకేసులు ఉన్న వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు.

జెడ్పీ కార్యాలయానికి స్థలం కేటాయింపు

- 10 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ
- హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్మించనున్న జెడ్పీ కార్యాలయం సముదాయానికి పది ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ బుధవారం కలెక్టర్ గిరీషా పీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశానుసారం కొన్ని వందల ఎకరాలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని సుండుపల్లె రహదారిలో పదెకరాల భూమిని కేటాయిస్తూ కలెక్టర్ ముందస్తు స్థానంకు (అడ్వాన్స్ పొజిషన్) జీఓ విడుదల చేయడం హర్షణీయమన్నారు. త్వరలో జరిగే క్యాబినేట్‌లో దీనికి ఆమోదించడం జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. జీఓ విడుదలపై ఆయన ఆనందం వ్యక్తం చేసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 20న జెడ్పీ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఎంపీ మిథున్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ అమరనాథరెడ్డి, కలెక్టర్‌లతో కలిసి ప్రారంభిస్తామని వెల్లడించారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ పంపిణీ



వృద్ధురాలు లక్ష్మీదేవికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ నరేష్

ప్రొద్దుటూరు: స్థానిక 27వ వార్డుకు చెందిన వృద్ధురాలు బి.లక్ష్మీదేవి అనారోగ్యంతో తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలోచికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న దివ్యాంగ వలంటీర్ బి.నరేష్ తిరుపతికి వెళ్లి ఆమెకు పింఛన్ అందించాడు. దీంతో వలంటీర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా ఉన్నతికి కృషి

- 'ఉన్నతి... మహిళా శక్తి' ద్వారా 11 ఆటోరిక్షాలు అందజేత
- మహిళల అభివృద్ధికి పెద్దపీట



లబ్ధిదారులకు ఆటోలను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ (ఫైల్)

రాయచోటి : మహిళల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఆర్థిక పరిపుష్టి లక్ష్యంగా మహిళలను చైతన్యవంతులు చేస్తూ వారిలో ఉన్న నైపుణ్యాన్ని బట్టి ప్రభుత్వం ప్రోత్సాహక కార్యక్రమాలను చేపడుతోంది. ఇప్పటికే వ్యాపారం, పెట్టుబడులు, పరిశ్రమల రంగాలలోనూ మహిళలకు తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చిన ప్రభుత్వం.. తాజాగా గ్రామీణ ప్రాంతాలలోని డ్వాక్రా మహిళలకు 'ఉన్నతి-మహిళా శక్తి' పథకం ద్వారా ఆటో రిక్షాలను అందజేశారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, నిరుపేద మహిళలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వడ్డీ లేని రుణాల ద్వారా అన్నమయ్య జిల్లాలో 11 మంది మహిళలకు ఆటోలను ఇచ్చారు. ఆటోలను అందుకున్న లబ్ధిదారులు ప్రతిరోజు పురుషులతో సమానంగా ప్రజలను వివిధ ప్రాంతాలకు చేరవేస్తూ ఆర్థికంగా స్థిరత్వాన్ని సాధిస్తున్నారు. మగవారితో సమానంగా ఆటో నడుపుతున్న మహిళలు డీజిల్ ఇతర ఖర్చులు పోను రోజుకు రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకు సంపాదిస్తుండటం విశేషం.

లబ్ధిదారుల వాటా..

ఈ పథకం ద్వారా లబ్ధిదారుడు 10 శాతం వాటా చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన 90 శాతం వడ్డీ లేని రుణం ద్వారా 48 కంతులలో తిరిగి డబ్బు చెల్లించేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెట్టి వాటిల్లో మహిళలను చైతన్యవంతులు చేస్తూ భాగస్వాములను చేసింది. పథకం కింద అందించిన ఆటోలను విజయవంతంగా నడుపుకునేలా సంబంధిత రవాణా, డీఆర్‌డీఏ శాఖాధికారులు వారికి తగిన సూచనలు సలహాలను అందజేస్తున్నారు.

రోజుకు రూ.500 మిగులుతోంది



నా పేరు మంచూరి రాధమ్మ. నాకు 40 ఏళ్లు. ఇంటర్ వరకు చదివాను. నాకు ఇద్దరు కొడుకులు. సంఘంలో చేరకముందు భార్యాభర్తలిద్దరము కూలి పనులకు వెళ్లే వారము. మాకు ఎటువంటి ఆస్తులు లేవు. కురబలకోట మండలం గ్రామ పరిధిలో నేను 15 సంవత్సరాలుగా సంఘంలో సభ్యురాలుగా ఉన్నాను. సంఘంలో చేరినప్పటి నుండి 6 లక్షల లబ్ధి పొందాను. తీసుకున్న ప్రతి లింకేజీ, వృధా చేయకుండా పిల్లల చదువులకు ఇంటి సంసారానికి ఇల్లు కట్టుకోవడానికి ఉపయోగించుకున్నాను. 15 ఏళ్ల క్రితం నా భర్తకు యాక్సిడెంట్ అయ్యి కాలు మొత్తం ఆపరేషన్ చేసినారు.నా భర్త ఆరోగ్యం బాగు చేసుకోవడానికి రూ.3 లక్షల దాకా ఖర్చు పెట్టాను. అయినా ఆరోగ్యం నయం కాక ఏడాది కిందట చనిపోయాడు. ఆ సమయంలో సంఘం నాకు కొండంత అండగా నిలిచింది. ఇప్పుడు ప్రభుత్వం నాకు కొండంత అండగా నిలిచింది. ఇప్పుడు ప్రభుత్వం నాకు ఉన్నతి లోను ద్వారా ఆటో మంజూరు చేశారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రాయచోటిలో ఆటో కిట్ మాకు అందజేశారు. రోజూ డీజిల్ ఖర్చులు పోను రూ.500 ఆదాయం పొందుతున్నాను. ఒంటరి స్త్రీ అయిన నాకు ఇంత మంచి జీవనాధారం కల్పించి ఆటోను మంజూరు చేయించిన కలెక్టర్‌కు ధన్యవాదాలు. - రాధమ్మ, అంగళ్లు గ్రామం

శ్రీశక్తి ఆటో ద్వారా అభివృద్ధి



నా పేరు జె.కల్పన. నా భర్త పేరు సురేష్. నేను 10వ తరగతి వరకు చదువుకున్నాను. మాకు ఇద్దరు అమ్మాయిలు. డ్రైవింగ్‌వృత్తిగా జీవనం సాగిస్తున్నాం. మదనపల్లి మండలం బసినికొండ గ్రామం పొన్నూరు పాలెం టు వివోలో హిమాలయ సంఘం సభ్యురాలని. నేను సంఘంలో చేరి 20 సంవత్సరాలైంది. సంఘంలో చేరకముందు నేను ఇంట్లోనే ఉండి పిల్లల్ని చూసుకునే దాన్ని. నా భర్త ఆటో తోలేవాడు. అది కూడా బాడుగ ఆటో. రోజుకి రూ.250 బాడుగ కట్టాలి. రోజుకు రూ.600 చొప్పున సంపాదించేవాడు. వచ్చిన డబ్బులతోనే సంఘానికి కట్టుకొని పిల్లల్ని చదివించుకుంటున్నాం. మేము ఎస్టీ ఎరుకుల కులానికి చెందిన వాళ్లం. ఈ క్రమంలో నా భర్తకి యాక్సిడెంట్ అయ్యి వెన్నెముక ఆపరేషన్ అయింది. దాంతో నేనే లైసెన్స్‌కు అప్లై చేసి శ్రీ శక్తి ఉన్నతి ఆటోకి దరఖాస్తు చేసినాం. మాకు ఉన్నతి నుంచి రూ.2.50 లక్షల లోను మంజూరు అయింది. ఈ రోజు మేము సొంత ఆటో పెట్టుకొని దర్జాగా ఆటో నడుపుకుంటున్నా.-జి.కల్పన, బసినికొండ, మదనపల్లి

ఆంధ్రా జట్టు ఘనవిజయం



తలపడుతున్న ఆంధ్ర, గోవా జట్లు

కడప స్పోర్ట్స్ : కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఆంధ్రా-గోవా జట్ల మధ్య నిర్వహించిన బీసీసీఐ అంతర్ రాష్ట్రాల అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు విజయం సాధించింది. బుధవారం 61 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన గోవా జట్టు 98.2 ఓవర్లలో 327 పరుగుల వద్ద ఆలౌట్ కావడంతో రెండో ఇన్నింగ్స్ ముగిసింది. జట్టులోని అభినవ్ తేజ్‌రాణా 158 పరుగులు చేశాడు. ఆంధ్రా జట్టు బౌలర్లు వై. వాసు 6, టి. విజయ్ 2 వికెట్లు తీశారు. కాగా ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 606 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా, గోవా జట్టు 226 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆంధ్రా జట్టు 53 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.



అభినవ్ తేజ్‌రాణా (158 పరుగులు)



వాసు (6 వికెట్లు)

జగనన్న ప్రభుత్వంలో యాదవులకు పెద్దపీట

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా



సంఘీభావం ప్రకటిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, యాదవ సంఘీయులు

కడప కార్పొరేషన్: జగనన్న ప్రభుత్వంలో యాదవులకు పెద్దపీట వేసి కీలక పదవులు ఇచ్చారని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ ఆడిటోరియంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యాదవుల ఆత్మీయ సమ్మేళనానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, ఆర్టీసీ చైర్మెన్ ఏ. మల్లికార్జునరెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సంఘ నేత కె. శివయాదవ్ తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు డిప్యూటీ సీఎం, జిల్లా అధ్యక్షులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ యాదవులు తమ తమ నియోజకవర్గాలలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం వల్ల జరిగిన లబ్ధిని సమావేశాల ద్వారా సంఘీయులకు తెలియచేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ క్లాస్ అని గుర్తించి వారిని ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అగ్రవర్ణాలతో పోటీ పడేలా చేసేందుకు తపన పడుతున్నారన్నారు. గతంలో చంద్రబాబు యాదవులను కేవలం గొర్రెలు, బర్రెలు మేపుకొనే వారిగా మాత్రమే చూశారని, బీసీల సమస్యల పరిష్కారం కోసం వెళ్తే అవమానించారన్నారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడేసరికి జయహో బీసీ అంటూ సభలు పెట్టి ప్రగల్బాలు పలుకుతున్నారని విమర్శించారు. బీసీలు ముమ్మాటికి చంద్రబాబును నమ్మే స్థితిలో లేరని, గతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ యాదవుల అభివృద్ధి కోసం పథకాలు తీసుకొచ్చారని, మొట్ట మొదటగా యాదవులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, వివిధ కార్పొరేషన్లు, నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించారన్నారు. బీసీల సత్తా ఏంటో వచ్చే ఎన్నికల్లో చూపాలని, సంక్షేమ పథకాలకు జగన్ బటన్ నొక్కినట్లే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ ఫ్యాన్ గుర్తుపై నొక్కాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, హరూన్ గ్రూప్స్ ఎండీ అహ్మద్‌బాషా, మార్కెట్ యార్డు ఛైర్మెన్ గంగాదేవి, జెడ్పీ వైస్ ఛైర్మెన్ బాలయ్య యాదవ్, చెన్నూరు జెడ్పీటీసీ చీర్ల సురేష్ యాదవ్, పార్టీ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

15మంది బైండోవర్

మదనపల్లె : వన్‌టౌన్ పరిధిలోని 15 మంది పాతనేరస్తులను బైండోవర్ చేసినట్లు సీఐ వలీబాషు తెలిపారు. బుధవారం వివిధ కేసుల్లో ఉన్న 15మందిని స్టేషన్ వద్ద హాజరు పరిచారు. ఎన్నికలు రానున్న నేపథ్యంలో పాత నేరస్తులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవల్లో పాల్గొనకుండా ఉండేందుకు ముందస్తుగా బైండోవర్ చేస్తున్నామన్నారు. అనంతరం ఒకొక్కరి నుంచి రూ.లక్ష పూచీకత్తు తీసుకుని తహసీల్దార్ మహబూబ్ చాంద్ ఎదుట హాజరుపరిచారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. మండలంలోని చిప్పిలి పంచాయతీ జమిలికుంటపల్లెకు చెందిన రాము భార్య జే.శ్రావణి(29) కుటుంబసమస్యలతో ఇంట్లో మందలించారన్న మనస్తాపంతో గాజుపెంకులు పొడిగా చేసుకుని తినింది. అదేవిధంగా బసినికొండకు చెందిన నాగరాజు భార్య ఎం.మీనా(28) పక్కింటివారితో గొడవపడి మనస్తాపంతో చీమలమందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బైక్ ఢీకొని వలంటీర్‌కు గాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని మహిళా వలంటీర్ గాయపడిన సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. 23వవార్డు బాపనకాలనీకి చెందిన మహిళా వలంటీర్ బైక్‌లో వ్యక్తిగత పనులపై వెళుతుండగా, సబ్ కలెక్టరేట్ వద్ద వెనుక నుంచి మరో ద్విచక్రవాహనంలో వచ్చిన యువకుడు ఢీకొన్నాడు. దీంతో ఆమె కిందపడి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ బస్టాండు ఆవరణలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి (45)తలపై నుంచి ఆర్టీసీ అద్దెబస్సు వెళ్లిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. టైరు కింద మృతుని తల పడటంతో ఛిద్రమైంది. విషయం తెలుసుకున్న అర్బన్ ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టరం నిమ్మితం స్థానిక ప్రాంతీయవైద్యశాలకు తరలించారు. బస్‌డిపో కంట్రోలర్ మునేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిస్తే రాజంపేట ఎస్ఐ 91211 00570, సీఐ 91211 00569 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆదాయానికి ప్రైవేటు

- తిరోగమనంలో హార్సిలీహిల్స్ టూరిజం ఆదాయం
- రూ.4.59 కోట్ల నుంచి సగానికి తగ్గింది
- ఒకప్పుడు ఉమ్మడిచిత్తూరులో హార్సిలీహిల్స్ టాప్



వేసవి విడది కేంద్రం హార్సిలీహిల్స్

బి.కొత్తకోట : రాష్ట్ర పర్యాటకశాఖలో బి.కొత్తకోట మండలంలోని వేసవి విడది కేంద్రం హార్సిలీహిల్స్ టూరిజం ఆదాయం తిరోగమనంలో పయనిస్తోంది. ఇక్కడి ప్రైవేట్ అతిథిగృహాల దెబ్బకు విలవిలాడుతోంది. దీని నిర్వహణపై ఎండీ స్థాయి నుంచి కిందిస్థాయి అధికారుల వరకు పర్యవేక్షణ ఉంటుంది. కొన్నేళ్లుగా పడిపోతున్న ఆదాయం విషయమై సమీక్ష లేకపోవడం విమర్శకు దారితీస్తోంది. టూరిజం అతిథిగృహాలకు సమాంతరంగా ఒకదాని వెనుక ఒకటిగా ప్రైవేటు అతిథిగృహాలు వెలిశాయి. దీంతో టూరిజానికి వస్తున్న ఆదాయంలో కోట్లు నష్టపోతోంది.

హార్సిలీహిల్స్‌పై టెంట్‌హౌస్‌లు కాకుండా 40కిపైగా అతిథిగృహాలు, బార్, రెస్టారెంట్‌తో టూరిజం యూనిట్‌లో 2000 ఏడాది నుంచి ప్రారంభమైంది. ఈ యూనిట్ ఆదాయం పరిశీలిస్తే..2018-19లో రికార్డుస్థాయిలో రూ.4.59 కోట్లు వచ్చింది. అంతకు ముందు రూ.3.50 కోట్లకు తగ్గకుండా ఆదాయం వచ్చింది. 2016-20 మధ్య ఉచ్చస్థితికి చేరుకుంది. ఒకదశలో ఏడాదికి రూ.5 కోట్లు దాటేస్తుందని అంచనా వేశారు. అయితే ఈ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. సాధారణంగా ఏటా వచ్చే ఆదాయంలో పదిశాతం లేదా అంతకుమించి వచ్చే ఏడాదిలో వస్తుందని అంచనా వేసి లక్ష్యాలను నిర్దేశిస్తారు. హార్సిలీహిల్స్ ఆదాయం విషయంలోనూ ఈ అంచనాలే ఉన్నప్పటికి పర్యాటకశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం ఫలితంగా మనుగడే ప్రశ్నార్థకమయ్యే స్థితికి చేరుకుంటోంది. 2012-13 ఏడాదిలో రూ.2.08 కోట్ల ఆదాయం రాగా, 2023-24 ఏడాదిలో నవంబర్ వరకు వచ్చింది రూ.2.16 కోట్లే.

టూరిజం ఆదాయన్ని ప్రైవేట్ అతిథిగృహాల నిర్వాహకులు లాగేసుకుంటున్నారు. హార్సిలీహిల్స్‌పై పర్యాటకశాఖ మెరుగైన సౌకర్యాలు, భద్రత, వసతులు కల్పిస్తోంది. అయితే ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న ప్రైవేటు అతిథిగృహాలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. తక్కువ ధరకే గదులు ఇస్తామని చెప్పి అధికధరలను వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ అతిథిగృహాల సంఖ్య పెరగడం, కొందరు ఇళ్లలోనే అతిథిగృహాలుగా చేసుకుని అద్దెలకు ఇవ్వడం చేస్తున్నారు. ఏటా వీటి ఆదాయం కోట్లలో ఉంటోంది. కొండపై టూరిజం అతిథిగృహాల సంఖ్య 52 అయితే, అనుమతిలేని ప్రైవేట్ అతిథిగృహాల సంఖ్య 90కిపైగా ఉన్నాయి. దీన్నిబట్టి చూస్తే వీటి ఆదాయం ఏటా ఎన్ని కోట్లలో ఉంటుందో అర్థమవుతుంది. అలాగే ప్రైవేట్ రెస్టారెంట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జేబులకు భారీగా చిల్లు పడుతున్నాయని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా వాటి కట్టడికి గాని, అనుమతుల పరిశీలనపై నామమాత్రంగానైనా స్పందించకపోవడం గమనార్హం.

హార్సిలీహిల్స్‌లో నెలకొన్న పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వశాఖలు పట్టించుకోకుంటే ప్రైవేటు నిర్వాహకులకు కలిసోస్తుంది.ప్రైవేటు వ్యక్తులు పాగా వేసి అతిథిగృహాలు, వ్యాపారపరంగా విస్తరింపజేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పటికే టూరిజంకు కోట్ల ఆదాయం నష్టం కలుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే కొండ ప్రైవేట్ వ్యక్తుల గుత్తాధిపత్యంలోకి వెళ్లిపోవడం ఖాయంగా కనిపిస్తోంది

2014 నుంచి పెరిగి తగ్గుతున్న టూరిజం ఆదాయం

ఏడాది	ఆదాయం
2011-12	రూ.208.52 (లక్షలు)
2012-13	రూ.315.89 (లక్షలు)
2013-14	రూ.254.39 (లక్షలు)
2014-15	రూ.3,36,96,921
2015-16	రూ.3,07,12,834
2016-17	రూ.4,09,63,259
2017-18	రూ.4,19,06,382
2018-19	రూ.4,59,97,075
2019-20	రూ.4,44,56,923
2020-21	రూ.2,36,60,038
2021-22	రూ.3,23,47,990
2022-23	రూ.3,63,55,493
2023-24	రూ.2,16,27,121



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపు రేఖలు నాడు-నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ఉచితంగానే ధృవీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అవసరమైన ధృవీకరణపత్రాలు ఉచితంగా తీసుకున్నా. గతంలో కుల, ఆదాయ ధృవీకరణపత్రాలు రావాలంటే మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. అవి ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉండేది. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధృవీకరణపత్రాలు ఉచితంగా సచివాలయం ద్వారా అందజేస్తున్నట్లు వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో మా పిల్లలకు అవసరమైన పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. రెండు రోజుల వ్యవధిలోనే వచ్చాయి. అంతేకాకుండా ఈబీసీ నేస్తం ద్వారా రూ.15 వేలు తీసుకున్నాం. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలన్నీ కూడా అర్హులైన వారికి ఇస్తున్నారు. మేము ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటాం.

– బాదిరెడ్డిరత్నమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

సొంతింటి కల సాకారం



గతంలో మేము మట్టి మిద్దెలో నివాసం ఉండేవాళ్లం. వర్షం పడినప్పుడల్లా కారుతుండటంతో ఇబ్బందులు పడాల్సి వచ్చేంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మాకు పక్కా గహాన్ని మంజూరు చేశారు. ప్రస్తుతం నూతనంగా ఇంటిని నిర్మించుకుని అందులో నివాసం ఉంటున్నాము. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– నల్లబిల్లి నాగేంద్ర, బుగ్గలేటి పల్లి గ్రామం, చింతకొమ్మదిన్నె మండలం

అమ్మఒడితో ఎంతో మేలు



జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి పథకాలు నా కుమార్తెకు వచ్చాయి. దీంతో పిల్లల చదువులకు ఎంతో మేలు జరిగింది. అలాగే వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 అందుతోంది. దీంతో పంటల సాగుకు పెట్టుబడులు పెట్టి సాగు చేస్తున్నా. ఆర్‌బీకేల ద్వారా ఊర్లోనే విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారు. పేదలకు మంచి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలి.

– సతీష్‌కుమార్‌రెడ్డి, లోమడ గ్రామం సింహాద్రిపురం

కర్ణాటక మద్యం స్వాధీనం : ఇద్దరు అరెస్ట్

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. బుధవారం మండలపరిధిలోని చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారని, ఈసమయంలో తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన మల్లిమణి(28) 8 ఫుల్‌బాటిల్స్ మద్యం తీసుకుకొస్తుండగా అదుపులోకి తీసుకున్నారన్నారు. మద్యం విలువ రూ.3,360 ఉంటుందని, దీనిని సీజ్‌చేసినట్లు చెప్పారు. అదేవిధంగా మదనపల్లె మండలం చీకలబైలుకు చెందిన పి.రామకృష్ణ(39) కర్నాటకకు చెందిన 4 నాక్‌ఔట్ బీర్స్, 1 క్వార్టర్ బాటిల్ తెస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు, అతడి వద్ద నుంచి రూ.770 విలువ కలిగిన కర్నాటక మద్యం స్వాదీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మద్యం విక్రయిస్తుండగా..

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసినట్లు టూటౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన చంద్రానాయక్(47) ఇంటివద్ద అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడివద్ద నుంచి దాదాపు రూ.2వేల విలువచేసే 18 క్వార్టర్ బాటిల్స్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్లో సర్టిఫికెట్లను తనిఖీ చేస్తున్న అడిషనల్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్.శైలజ.

మదనపల్లె : పట్టణంలోని వివిధ స్కానింగ్ సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్‌లను జిల్లా అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్.శైలజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలోని యంత్రాలను, రిజిస్టర్, సర్టిఫికెట్లను తనిఖీ చేసి సంబంధిత సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు అందజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకే స్కానింగ్ కేంద్రాలు నిర్వహించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని రామారావుకాలనీ అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి, ఓపీ రిజిస్టర్‌లో రోగుల వివరాలను పరిశీలించారు. ఓపీ పేషెంట్లలో క్షయ లక్షణాలు కలిగిన వారిని గుర్తించి టెస్టింగ్‌ల సంఖ్య పెంచాలన్నారు. 2025లోపు టీబీరహిత దేశం కోసం కింది స్థాయి నుంచి క్షయకేసులను గుర్తించాలన్నారు. ప్రతి లక్ష జనాభాకు 2,000 మంది అనుమానితులను గుర్తించి పరీక్షలు జరపాలని, ఇందుకు ఫ్యామిలీ ఫిజీషియన్, ఎన్‌సీడీసీడీ సర్వేలను ఉపయోగించుకోవాలన్నారు. అనుమానితులను గుర్తించి పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్‌ల డాక్టర్‌లు, ల్యాబ్ టెక్నీషియన్స్‌తో డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...టీబీ, లెప్రసీ, హెచ్ఐవీలకు సంబంధించి అవగాహన కల్పిస్తూ, ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రిజిస్టర్‌లు మెయిన్‌టెన్స్ చేసి ఎప్పటికప్పుడు రికార్డ్‌లు అప్‌డేట్ చేసుకుని ఆన్‌లైన్‌లో నమోదుచేయాలన్నారు కార్యక్రమంలో డాక్టర్‌లు సల్మాన్, భార్గవి, కీర్తిప్రియ, మోహిత్, విష్ణువర్ధన్, టీబీ సూపర్‌వైజర్ ఎస్.ప్రభాకర్, డీపీఎంఓలు వేణుగోపాల్, శ్రీనివాసులు, టీబీ విభాగం సిబ్బంది శాంతి, సుశీల, వనజకుమారి, తరుణ్, సునీత, ల్యాబ్ టెక్నీషియన్‌లు, డిప్యూటీ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళిక తయారీపై అవగాహన అవసరం



శిక్షణకు హాజరైన అధికారులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ధనలక్ష్మి

రాయచోటి అర్బన్ : ఖాళిక తయారీపై అధికారులకు సమగ్రమైన అవగాహన అవసరమని జెడ్పీసీఈఓ, జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి అన్నారు. బుధవారం పట్టణ శివార్లలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌అండ్ టెక్నాలజీ కళాశా లలో ప్రణాళిక తయారీపై మండలస్థాయి అధికారులకు 2వ శిక్షణా శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ,మండల,జిల్లా స్థాయి ప్రణాళికపై సరైన అవగాహన కల్పించేందుకే శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రీసోర్స్ పర్సన్‌లు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఏవిధంగా పనులు చేపట్టాలనే అంశంపై అధికారులకు అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయం పరిపాలన, విస్తరణాధికారులు, మండల ఇంజినీరింగ్, పంచాయతీ అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



కారు,ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులు

పీలేరు : పులిచెర్ల మండలం కొత్తపేట సమీపంలో కారుతోపాటు రూ. 12 లక్షలు విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో సుబ్బారెడ్డి తెలిపారు. ముందుగా అందిన రహస్య సమాచారం మేరకు కొత్తపేట సమీపంలో బుధవారం తెల్లవారుజామున అటవీ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. రొంపిచెర్ల వైపు నుంచి వేగంగా వెళుతున్న వాహనాన్ని సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లాడు.కొంత దూరం వెళ్లాక రోడ్డు పక్కన ఆపి చీకటిలో పరారయ్యాడు. వాహనాన్ని పరిశీలించగా 8 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. ఎఫ్ఆర్‌వో వెంకటరమణ, అటవీసిబ్బంది జె.ప్రతాప్, ప్రభుతేజ, చరణ్, సుబ్రమణ్యం, మల్లికార్జున పాల్గొన్నారు.

వ్యక్తి దారుణహత్య




చెంగయ్య మృతదేహం

ఓబులవారిపల్లె : మండల కేంద్రం నడిబొడ్డు మర్రిమాను వద్ద కటికంవారిపల్లె గ్రామానికి చెందిన కటికం చెంగయ్యను (48) దారుణంగా హత్యచేశారు. పోలీసుల కథనం మేరకు బుధవారం సాయంత్రం 5 గంటలకు మర్రిమానువద్ద నిలుచుని ఉండగా ఆయనపై శివశంకరాపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కేకలు వేస్తూ కత్తితో చేయి, తల, మెడ భాగంలో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన చెంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పాత కక్షలే హత్యకు కారణమని స్థానికులు చర్చించుకుంటున్నారు. హత్య జరిగిన వెంటనే స్థానికులు సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు వచ్చేలోపే నిందితులు పరారయ్యారు. మృతుడు ఇరవై ఐదు సంవత్సరాల క్రితం హత్యకేసులో నిందితుడు. ఇతను స్థానికంగా తమలపాకు తోటలలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

ప్రాణాలు పోతున్నాయి.. ఆదుకోండి

కిడ్నీ వ్యాధిగ్రస్తుడి వేడుకోలు



నరసింహులు

చిట్వేలి : నాలుగు సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ప్రాణాలు నిలబెట్టుకునేందుకు అగచాట్లు పడుతున్నాను. ప్రాణాలు కాపాడాలని కిడ్నీ వ్యాధి గ్రస్తుడు మోడపోతుల నరసింహులు ఆవేదన వ్యక్తం చేశారు. చిట్వేలి మండలం కెఎస్ అగ్రహారం దళితవాడకు చెందిన నరసింహులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాలుగేళ్ల కిందట రెండు కిడ్నీలు చెడిపోయాయి. అప్పటి నుండి డయాలసీస్ చేయించుకుంటున్నాడు. దాతలు చేసిన సహకారంతో ఇన్ని రోజులు చికిత్స చేయించుకుంటున్నాడు. వ్యాధి ఎక్కువ కావడంతో ఆర్థికంగా ఎటువంటి దారి లేకుండా పోయిందని వాపోతున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఆస్తి మొత్తాన్ని అమ్ముకొని తిరుపతి, నెల్లూరు, ఏలూరులో చికిత్స చేయించుకున్నానని, తన దగ్గర చిల్లిగవ్వ కూడా లేదని, ఇకపై ఏ విధంగా చికిత్స చేయించుకోవాలో దిక్కుతోచడం లేదని వాపోతున్నాడు. తనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారని, కుటుంబ పోషణకు ఎటువంటి ఆధారంలేదని, ప్రస్తుతం ఆరోగ్యం పూర్తిగా క్షీణించి ఇబ్బందులు పడుతున్నానని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనను ఆదుకోవాలని, ప్రభుత్వం ద్వారా ఉచిత వైద్యం అందేలా చూడాలని వేడుకుంటున్నాడు. దాతలు సాయం చేయదలచిన వారు 9866172259 నంబర్‌కు ఫోన్ చేసి ఆదుకోవాలని నరసింహులు విన్నవిస్తున్నాడు.

మల్లయ్యకొండపై అభివృద్ధి పనులకు రూ. కోటి నిధులు



మల్లయ్యకొండపై వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె : మండలంలోని మల్లయ్యకొండపై అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ. కోటి నిధులు మంజూరైనట్లు అటవీశాఖ సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసులు, రేంజర్ మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు మల్లయ్య కొండను సందర్శించారు. భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గౌరమ్మ గుట్టవద్ద వ్యూ పాయింట్ ఏర్పాటుకు గుర్తించిన స్థలాన్ని, క్వార్టర్‌లను నిర్మించేందుకు గుర్తించిన స్థలాలను పరిశీలించారు. నిర్మాణాలు చేపట్టేందుకు అంచనా నివేదిక పంపి, త్వరలో పనులు ప్రారంభించేదుకు చర్యలు చేపడతామన్నారు. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి మల్లయ్యకొండ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, నిధుల మంజూరుకు సహకరించడంపై హర్షం వ్యక్తం చేశారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మండలంలోని కొండయ్యగారిపల్లెలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. స్థానికుడైన వెంకటరమణ కుమారుడు రవి సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉత్తమ వైద్యులుగా పేరు తెచ్చుకోవాలి





జ్యోతి వెలిగించి స్నాతకోత్సవ వేడుకలను ప్రారంభిస్తున్న పూర్వపు డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ తదితరులు, పాల్గొన్న 2018 బ్యాచ్ దంతవైద్య కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ప్రభుత్వ దంతవైద్య కళాశాల పూర్వపు డైరెక్టర్ చంద్రశేఖర్

కడప అర్బన్ : దంతవైద్యవిద్యను అభ్యసించిన వారు సమాజంలో ఉత్తమ దంతవైద్యులుగా పేరు తెచ్చుకోవాలని, పేదప్రజలకు సేవలను అందించేందుకు ముందుకు రావాలని కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాల పూర్వపు డైరెక్టర్, తిరుపతి సీకెఎస్ తేజ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ హెచ్ఓడి డాక్టర్ ఎం. చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో దంతవైద్య విద్యను పూర్తి చేసుకున్న 2018 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవ వేడుకలను కడపలోని విష్ణుప్రియ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్‌జిల్లాలో రిమ్స్‌తో పాటు, అదే ప్రాంగణంలో ప్రభుత్వ దంతవైద్య కళాశాలను ఏర్పాటు చేయాలనేది దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కల అని అన్నారు. 2008-09 విద్యా సంవత్సరంలో అప్పటికే నెలకొల్పిన రిమ్స్ ఆవరణలోనే ప్రభుత్వ దంతవైద్య కళాశాలకు శంకుస్థాపన చేయించారన్నారు. తర్వాత ఏడాదిన్నరకే 2009 జనవరి 24న ప్రారంభించారన్నారు. డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (డీసీఐ)తో నేరుగా సంప్రదింపులు జరిపి కళాశాల మంజూరు, స్థాపన విషయంలో డాక్టర్ వైఎస్సార్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ఆయన బాటలోనే కుమారుడు.. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో పీజీ సీట్లు వచ్చేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. దంతవైద్యవిద్యను అభ్యసించిన వారు సమాజంలో ఉత్తమ దంతవైద్యులుగా పేరు తెచ్చుకోవాలని, పేదప్రజలకు సేవలను అందించేందుకు ముందుకు రావాలన్నారు. ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్ రిజిస్ట్రార్, విజయవాడ జీడీసీ ప్రొఫెసర్ అండ్ హెచ్ఓడీ డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాలలో 2018 బ్యాచ్ వారు స్నాతకోత్సవ వేడుకల్లో దంత వైద్య కోర్సును పూర్తి చేసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందోత్సాహాలను జరుపుకోవడం అభినందనీయంగా వుందన్నారు. కార్యక్రమంలో కడప ప్రభుత్వ దంతవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. జ్యోత్స్న కళాశాలను స్థాపించినప్పటి నుంచి సాధించిన ప్రగతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దాశరథి, డాక్టర్ మహాలక్ష్మి, డాక్టర్ సుప్రజ, డాక్టర్ జయచంద్రారెడ్డి, డాక్టర్ శేషారెడ్డి, డాక్టర్ రామోహన్ రెడ్డి, 2018 బ్యాచ్ దంతవైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.